క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11కేవీ భవానీపురం ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో 3గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు మానవ మందిరం రోడ్, స్వాతీ థియేటర్ రోడ్, పోపూరివారి వీధి, ఎమ్ ఎస్ వీధి, హనుమయ్య వీధి, గుడివాడ రామారావు వీధి ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేస్తామని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉత్సాహంగా మయూఖ 2కే 25



లబ్బీపేట(విజయవాడతూర్పు): ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీఎంఏ స్టూడెంట్స్ కన్వెన్షన్ మయూఖ 2కే 25 ఉత్సాహంగా జరిగింది. ఎంజీ రోడ్డులోని శేషసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో కామర్స్‌తో తమకు ఉన్న పట్టు, ప్రతిభను నిరూపించుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ బిభూతి భూషణ్‌నాయక్, వైస్ ప్రెసిడెంట్ టీసీ ఏ శ్రీనివాసప్రసాద్, ముంబై, కోల్‌కతా, చెన్నై, పుణే, బెంగళూరు, హైదరాబాద్, కౌన్సిల్ రీజనల్ కౌన్సిల్ మెంబర్స్ పాల్గొన్నారు. స్థానిక ప్రతినిధి సుంకర నాగపూర్ణిమ పర్యవేక్షించారు.

డాక్టర్ మారుకు అంతిమ వీడ్కోలు



పటమట(విజయవాడతూర్పు): అనారోగ్యంతో మరణించిన గోరా కుమార్తె , డాక్టర్ జి. మారు అంత్యక్రియలు శుక్రవారం నగరంలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ వద్ద ఉన్న శ్మశాన వాటికలో జరిగాయి. ఆమె మరణ వార్త తెలిసి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సన్నిహితులు, నాస్తికులు, వైద్య రంగ ప్రముఖులు పెద్దసంఖ్యలో నగరంలోని నాస్తిక కేంద్రానికి వచ్చి మారు భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. గోరా కుటుంబం నాస్తిక ఉద్యమంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మారు భర్త హరి సుబ్రహ్మణ్యం, కుమారుడు ఓలాస్ గోరా, డాక్టర్ సమరంను పరామర్శించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబురావు, డి.రమాదేవి, ప్రోగ్రెసివ్ ఫోరం కార్యదర్శి చంద్రరావు, సీనియర్ సిటిజన్స్ సంఘం కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, నాస్తికులు అరుణకుమార్, డాక్టర్ రమేష్, జన చైతన్య వేదిక అధ్యక్షులు లక్ష్మణ రెడ్డి, తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

'ఎగ్జిబిట్'లో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నగరంలోని నలంద డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన ఎగ్జిబిట్–2025 పేరుతో నిర్వహించిన వివిధ పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులను పొందారని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. బహుమతులు పొందిన విద్యార్థులను కళాశాల ఆవరణలో శుక్రవారం అభినందించారు. క్విజ్, పీపీటీ ప్రజెంటేషన్‌లో మొదటి బహుమతిని, ట్రెజర్ హంట్, ఐ ఆన్ ది బాటిల్, అంత్యాక్షరి పోటీల్లో రెండో బహుమతిని సాధించారని తెలిపారు. బహుమతులు పొందిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి.జంపాల, అధ్యాపకులు ఐవీ.వెంకటేశ్వరరావుతో పాటుగా విద్యార్థులు అభినందించారు.

సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం మాఘ మాసం పురస్కరించుకుని సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. శివజ్ఞాన పీఠంలో శివ సూర్యులకు లక్ష పద్మ బీజార్చన కార్యక్రమం జరిగింది. పీఠాధిపతి శివాచార్య స్వామి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము లోక కల్యాణార్థం లక్ష తామర పూసలతో స్వామివారికి అర్చనలు చేసి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పడకేసిన పారిశుద్ధ్యం

- పూర్ణానందం పేట వీధుల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు
- పట్టించుకోని పారిశుద్ధ్య సిబ్బంది.

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): స్థానిక 35వ డివిజన్ పూర్ణానందంపేటలో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా మారింది. ఇక్కడి మసీదు వీధి, సాయిబాబగుడి వీధి, సంజీవరావు వీధి, కరుణ హోటల్ సెంటర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లపై మురుగు పారుతుండగా, వీధుల్లో ఎక్కడ చూసినా వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి.

దుర్గంధభరితంగా వీధులు...

దేశంలోని నలుమూలల ప్రాంతాల నుంచి వచ్చే రైలు ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉండే కరుణ హోటల్ సెంటర్‌లో డ్రైయిన్లు పూడుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఈ ప్రాంతంలో పారిశుద్ధ్యం మెరుగునకు నగరపాలక సంస్థ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హోటళ్ల వ్యర్థాలన్నీ సైడుకాల్వల్లోనే...

ఇక్కడ పదుల సంఖ్యలో ఉన్న హోటల్ నిర్వాహకులు హోటళ్ల నుంచి వచ్చే వ్యర్థాలను సైడ్‌కాల్వల్లోకి వదులుతుండటంతో ఈ ప్రాంతంలో ముక్కుపుటాలు అదిరేలా దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. పలువురు నిర్వాహకులు హోటళ్లలో మిగిలిపోయిన ఆహారపదార్థాలను కూడా సైడ్‌కాల్వల్లోనే పడేస్తుండటంతో అవికాస్తా కుళ్లిపోయి తీవ్ర దుర్వాసనను వెదజల్లుతుండంతో ఇబ్బందులుపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.



మసీదు వీధిలో రోడ్లపై పడేసిన వ్యర్థాలు

రోడ్లపైనే చెత్త చెదారం...

నిత్యం ఇంటింటికి వచ్చే చెత్తను సేకరించాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది కూడా ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో స్థానికులు చెత్తను రోడ్లపైనే డంప్ చేస్తున్నారు. దీంతో రోడ్లన్నీ చెత్తతో నిండి పోతున్నాయి. పశువులు, వీధి కుక్కలు రోడ్లపై ఉన్న ఈ వ్యర్థాలను చెల్లాచెదురు చేస్తుండటంతో ఆయా వీధుల్లో నడవాలంటేనే కష్టంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



సంజీవరావు వీధిలో రోడ్లపైనే ఉంచిన సామగ్రి

పొంగిపొర్లుతున్న సైడ్‌కాల్వలు..

ఈ ప్రాంతంలోని సైడ్‌కాల్వలను కూడా శుభ్రం చేయకపోతుండటంతో కాల్వలో పూడికతీత పెరిగి మురుగునీరు ముందుకుసాగక రోడ్లపైకి చేరుతోంది. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతూ వ్యాధులబారినపడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. వారానికి ఒక్క సారి కూడ సైడ్ డ్రైన్‌లను శుభ్రపరిచేందుకు పారిశుద్ధ్య సిబ్బంది రావటం లేదని స్థానికులు మండి పడుతున్నారు. దీంతో డ్రైన్‌లు పొంగి మురుగు రొడ్లపైకి చేరుతుందని స్థానికులు చెప్తున్నారు. దీంతో దొమలు, ఈగలు విపరీతంగా పెరిగి పొయి తాము అనారొగ్యం పాలవుతున్నామని స్థానిక నివాసులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.



డ్రైనేజీల్లో ముందుకు కదలని మురుగు

అధికారులకు పట్టని పారిశుద్ధ్యం...

డివిజన్‌లో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా మారిన నగర పాలకసంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోజూ ఇంటి వద్దకు వచ్చి చెత్తను సేకరించే పారిశుద్ధ్య సిబ్బంది కూడా రెండుమూడు రోజులకు ఒకసారి కూడా చెత్తను సేకరించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా నగర పాలకసంస్థ అధికారులు స్పందించి డివిజన్‌లో పారిశుద్ధ్యం మెరుగునకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జ్వరాలతో బాధపడుతున్నాం..

సంజీవరావు వీధిలో నెలకున్న పారిశుద్ధ్య సమస్య కారణంగా కుటుంబంలోని పిల్లలు, వృద్ధులు జ్వరాల భారిన పడుతున్నారు. దీంతో ఆసుపత్రులు చుట్టూ తిరగాల్సి వస్తోంది. అధికారులు స్పందించి పారిశుద్ధ్యం మెరుగునకు తగిన చర్యలు తీసుకోవాలి.

–సులోచన, స్థానికురాలు

సైడ్‌కాల్వలో పూడిక తీయాలి...

సైడుకాల్వలో మురుగు నీరు సజావుగా పారేలా అధికారులు చర్యలు చేపట్టాలి. మురుగు నీరు పారుదల లేకపోవడంతో దోమలు వృద్ధి చెందుతూ రాత్రివేళల్లో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కనీసం దోమల నివారణకు ఫాగింగ్ చేసే వారు కూడా కరువయ్యారు.

–నాగవల్లి, స్థానికురాలు

ప్రమాదాల బారిన వాహనచోదకులు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సారంగం రోడ్డు వైపు నుంచి వచ్చే వాహనాలు యూటర్న్ తీసుకునేందుకు వీలుగా కేటీరోడ్డులో సెంట్రల్ డివైడర్‌లో కొంతభాగాన్ని తొలగించిన అధికారులు, అక్కడ ఉన్న ఇనుప చువ్వలను మాత్రం తొలగించకపోవడంతో నిత్యం ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఇనుప చువ్వల కారణంగా పలువురు వాహనచోదకులు గాయాల పాలవుతున్నారు. దీంతో పరిస్థితి పెనంపై నుంచి పొయ్యిలోపడినట్లుయిందని వాహనచోదకులు వాపోతున్నారు. మూడు అడుగుల మేర ఉన్న రెండు చువ్వలు, అడుగు, అరడుగు మేర మరో నాలుగు చువ్వలు రోడ్డుపైకి పొడుచుకువచ్చాయి. మరో వైపున డివైడర్ తొలగించిన ప్రాంతంలో రోడ్డును చదును చేసేందుకు సిమెంట్‌తో మొక్కుబడిగా పనులు చేపట్టారు. దీంతో ఇనుకపై నుంచి ద్విచక్రవాహనాలు ప్రయాణించే క్రమంలో పట్టుతప్పి వాహనచోదకులు జారిపడిపోతున్నారు. రోజులో కనీసం పదికి పైగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు డివైడర్ తొలగించిన ప్రాంతంలో తారుమిక్స్‌తో మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



త్వరితగతిన ప్రజా సమస్యల పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు): త్వరితగతిన ప్రజా సమస్యలు పరిష్కరించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. శుక్రవారం ఆయన సర్కిల్–2 పరిధిలోని గోపాల్‌రెడ్డి రోడ్డు, సర్కిల్–1 పరిధిలోని కెనాల్‌రోడు, సర్కిల్–3 పరిధిలోని ఏపీఎస్ ఆర్ఎం స్కూల్ వద్ద ఉన్న అన్న క్యాంటిన్‌ను పరిశీలించారు. 23వ డివిజన్ ఎన్టీఆర్ కాంప్లెక్స్, గోపాల్ రెడ్డి రోడ్డు ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణపై అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంప్లెక్స్ వద్ద ఉన్న యూరినల్స్ తొలగించి మరుగుదొడ్డిని నిర్మించాలనితానిచ్చిన ఆదేశాలను బేఖాతర్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా మరుగుదొడ్డిని నిర్మించాలని ఆదేశించారు. అనంతరం ఆయన వినాయకుని గుడి, కెనాల్ రోడ్డు, భవానీపురంలోని హోల్డింగ్ ఏరియా ప్రాంతంలో పర్యటించారు. దసరా ఉత్సవాలు, భవానీలకు శాశ్వతమైన మరుగుదొడ్లను హోల్డింగ్ ఏరియాలో నిర్మించాలని ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. నగరంలో ఉన్న వంతెనలకు కీ ఫెన్సింగ్ వేయాలని, వాటికి పెయింటింగ్ వెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం సర్కిల్ 3 పరిధిలోని కృష్ణలంకలో ఉన్న ఏపీఎస్‌ఆర్ఎం స్కూల్ వద్ద ఉన్న అన్న క్యాంటిన్ పరిశీలించి ప్రతిరోజు నోడల్ అధికారులు క్యాంటిన్‌లను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇంచార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్లు పి. సత్యనారాయణ, పి.సత్యకుమారి, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.



నగరంలో పారిశుద్ధ్య విధానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, వీఎంసీ అధికారులు

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శ్రీవారిని పెండ్లికుమారునిగా అలంకరణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):. వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా మాఘశుద్ధ దశమి నుంచి బహుళ పాడ్యమి వరకూ బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం మూలవిరాట్‌కు పంచామృతాలతో, వివిధ సుగంధ ద్రవ్యాలతో స్నపనాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదనాదం, మంగళవాయిద్యాలు, సంకీర్తనా గానాల మధ్య స్వామి వారి తిరుమంజనం అత్యంత కన్నులపండువగా సాగింది. అనంతరం స్వామివారిని పెండ్లికుమారునిగా అలంకరించారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, ఋత్విరోహణ, రక్షాబంధన, అజస్రదీపారాధనలు, అంకురార్పణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సమయంలో స్వామి వారిని దర్శించుకోవడం ద్వారా చక్కని ఫలితముంటుందని ఆలయ అర్చకస్వాములు పేర్కొన్నారు. అతిథుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ నెల 10వ తేదీన స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పర్యవేక్షించారు.



స్వామివారి ఉత్సవమూర్తులు



ఉత్సవాలను పురస్కరించుకుని పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

నానో టెక్నాలజీతో ఉత్తమ భవిత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నానో టెక్నాలజీ రంగానికి మరింత ఉజ్వల భవిష్యత్ ఉందని ప్రముఖశాస్త్రవేత్త, సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ (బెంగళూరు) డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎల్వీ ప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి సహకారంతో కేబీఎన్ కళాశాల ఎలక్ట్రానిక్, భౌతిక, రసాయన శాస్త్ర విభాగాలు సంయుక్తంగా 'ఫంక్షనల్ అండ్ స్మార్ట్ మెటీరియల్స్' అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు కేబీఎన్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమైంది. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయం, వైద్యం, వాతావరణ పరిశోధన, రక్షణ, సమాచార రంగాల్లో నానో టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. నానో వినియోగంలో మనదేశంలో ప్రపంచంలో మూడోస్థానంలో ఉందన్నారు. నానో ఆవిష్కరణ కారణంగా భారత వ్యవసాయ రంగం వినూత్న పద్ధతులకు మారి, గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. నానో రంగంలో పరిశోధనలకు ప్రభుత్వ కేటాయింపులు ఇంకా పెరగాలన్నారు. ఐఐటీ హైదరాబాదు ప్రొఫెసర్ సి సుబ్రహ్మణ్యం 'మెటల్ ప్లాస్మోనిక్ నానో స్ట్రక్చర్ ఫర్ గ్రీన్ హైడ్రోజన్ ప్రొడక్షన్ బై ఫోటో ఎలక్ట్రో కెమికల్ సెల్స్' అంశంపై, హైదరాబాదుకు చెందిన మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రీసెర్చ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఈశ్వర్‌ప్రసాద్ రక్షణ రంగంలో ఫంక్షనల్, ఇంజినీరింగ్ మెటీరియల్స్ అంశంపై ప్రసంగించారు. డాక్టర్ లూకాపావిక్ (సీనియర్ రీసెర్చ్ అసోసియేట్, రాడార్ బస్కోవిక్ ఇన్స్టిట్యూట్, కోర్టియా) అంతర్జాలం ద్వారా 'ఎలక్ట్రికల్ ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ఫంక్షనల్ మెటీరియల్ విత్ డిజార్డర్ స్ట్రక్చర్: ఏ కేస్ స్టడీ ఆఫ్ పాస్ పెట్ బేస్డ్ గ్లాసెస్' అనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రచురించిన పరిశోధన పత్రాల సావనీర్‌ను అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, కన్వీనర్ డాక్టర్ వి.రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

మహిమాన్వితం మేరీమాత పుణ్యక్షేత్రం



గుణదల(విజయవాడ తూర్పు): మహిమాన్వితం మేరీమాత పుణ్యక్షేత్రమని ప్రావిన్షియల్ సుపీరియర్ ఫాదర్ బలుగూరి రాజు అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న నవదిన ప్రార్థనల్లో ఎనిమిదవ రోజైన శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మరియమాతను ఆశ్రయించిన వారికి సకల ఆశీర్వాదాలు లభిస్తాయన్నారు. భక్తుల కోర్కెలను భగవంతునికి చేర్చుతూ ఆమె ప్రార్థిస్తుందన్నారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందచేశారు. అంతకు ముందు పలు విచారణల నుంచీ వచ్చిన గురువులు, మఠకన్యలు, భక్తులు కొవ్వొత్తులు, జపమాల ధ్యానంతో కొండ పైకి చేరుకున్నారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, ఫాదర్ సునీల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పైపులైన్‌కు లీకేజీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):కొండ ప్రాంతంలో నివసించే వందలాది మందికి తాగునీరు సరఫరా చేసే మంచినీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి పెద్ద ఎత్తున తాగునీరు వృధా అవుతోంది. అయితే లీకేజీని గుర్తించిన కార్పొరేషన్ సిబ్బంది పైపులైన్‌కు లీకేజీని అరికట్టాల్సింది పోయి... ప్లాస్టిక్ కంచి, పురుకోసతో మరమ్మతులు చేసినట్లు మమ అనిపించిన ఈ ఘటన భీమన వారి పేటలోని ఆంజనేయ స్వామివారి గుడి వద్ద చోటుచేసుకుంది. మంచినీటి పైపులైన్ మురుగు నీటి కాల్వపై ఉండటంతో ఏమాత్రం డ్రైయిన్ పొంగినా ఆ మురుగు నీరంతా పైపులైన్‌లోకి చేరే ప్రమాదం ఉంది. నీరు కలుషితమైతే ప్రజారోగ్యానికి ఇబ్బంది అవుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే కార్పొరేషన్ అధికారులు స్పందించి మంచినీటి పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



పైపులైన్ లీకేజీతో వృధాగా పోతున్న తాగునీరు

అత్యాధునికంగా పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రెండున్నర దశాబ్దాలుగా వైద్య సేవలు అందిస్తున్న పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్‌లో ఇప్పుడు మల్టీ స్పెషాలిటీ, ట్రామా, క్రిటికల్ కేర్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పల్లెం పెద్దేశ్వర రావు తెలిపారు. ఆస్పత్రిలో 150 పడకలు ఉండగా, 100 క్రిటికల్ కేర్ బెడ్స్, 8 ఐసీయూలతో రూపుదిద్దుకున్న నూతన ప్రాంగణాన్ని ఈ నెల 9న లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా సూర్యారావుపేటలోని ఆస్పత్రి ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆస్పత్రి వివరాలు వెల్లడించారు. పాతికేళ్ల క్రితం 20 పడకలతో ప్రస్తానం ప్రారంభమై, వందశాతం సక్సెస్ రేటుతో వైద్యం చేసినట్లు తెలిపారు. ఆస్పత్రి సీఈఓ డాక్టర్ పల్లెం ఆకాష్ మాట్లాడుతూ నూతన ప్రాంగణంలో కార్డియాలజీ, కార్డియోథోరాసిక్ సర్జరీ, పల్మనాలజీ, క్రిటికల్ కేర్, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, ఆర్థోపెడిక్, ట్రామా విభాగాల్లో సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రారంభోత్సవ బ్రోచర్ ఆవిష్కరించారు.



ఆస్పత్రి ప్రారంభోత్సవ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సిద్ధార్థ క్యాడెట్లకు అభినందన

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో భాగంగా కర్తవ్యపథ్‌లో జరిగిన గ్రాండ్ కవాత్‌లో తమ కళాశాల ఇద్దరు న్యావెల్ క్యాడెట్లు హాజరు కావడం గర్వకారణంగా ఉందని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. గణతంత్ర వేడుక కవాతులో పాల్గొన్న క్యాడెట్లను కళాశాల ఆవరణలో శుక్రవారం అభినందించారు. రమేష్ మాట్లాడుతూ క్యాడెట్లు హేమంత్, అరవింద్ గ్రాండ్ కవాతులో పాల్గొనడంతో పాటుగా గణతంత్ర ఉత్సవాలను స్వయంగా వీక్షించారని తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ జాతీయస్థాయి వేడుకల్లో మా కళాశాల నుంచి ఇద్దరు క్యాడెట్లు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. యువతలో దేశభక్తి, పౌర బాధ్యతను పెంపొందించడానికి తమ కళాశాల అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. కళాశాల డీన్ రాజేష్ సి జంపాల, కళాశాల అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ వెంకటేష్ అకురాతితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు క్యాడెట్లను అభినందించారు.



హాస్య జల్లులు కురిపించిన నాటికలు



విజయవాడ కల్చరల్: సుమధుర కళానికేతన్ ఆధ్వర్యంలో ముమ్మనేని సుబ్బారావు కళాపీఠం సౌజన్యంతో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలోని ఆడిటోరియంలో మూడు రోజులపాటు నిర్వహించే జాతీయ స్థాయి హాస్యనాటికల పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. యువ నటీనటులు, దర్శకులను ప్రోత్సహిస్తూ వారికి వేదికమీద అవకాశం కల్పిస్తూ సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులు వందే జగద్గురుం నాటిక ప్రదర్శించారు. పోటీ నాటికలుగా కళాంజలి హైదరాబాద్ వారి వీడేంమగాడండీ బాబు నాటికలను ప్రదర్శించారు. రెండవనాటికగా అద్దేపల్లి భరత్‌కుర్ రచించిన వర్క్‌ఫ్రంహోమ్ నాటికలను ప్రదర్శించారు.

రాజకీయ సభగా మార్చిన ఏపీ సృజనాత్మక సమితి చైర్‌పర్సన్

పోటీలను ఏపీ కల్చరల్ చైర్‌పర్సన్ పొగడపాటి తేజస్వి ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమాన్ని రాజకీయ సభను చేయడం పలు విమర్శలకు తావిచ్చింది. కూటమి ప్రభుత్వంతో రాష్ట్ర ప్రగతి సాధ్యమైందని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సాంస్కృతిశాఖా మంత్రి కందుల దుర్గేష్‌ను పొగడటానికే ఎక్కవ సమయం కేటాయించండంతో వేదికమీద ఉన్న అతిథులతోపాటు ప్రేక్షకులు సహితం అసహనం వ్యక్తం చేశారు. పరిషత్ చైర్మన్ డాక్టర్ ఎస్.మురళీకృష్ణ, సుమధుర కళానికేతన్ అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు, ప్రధాన కార్యదర్శి పీ భాస్కర శర్మ పాల్గొన్నారు. 2025 సంవత్సరానికిగానూ రంగస్థల ప్రముఖుడు జీ రాధాకృష్ణ స్మారక పురస్కాన్ని సినీ నటుడు, రంగస్థల ప్రయోక్త ఎస్‌కే మిశ్రోకు ప్రదానం చేశారు.